# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



**DECEMBER 1994**

# సంక్షిప్త వార్తలు

1994 నవంబరు మొదటివారములో సోదరులు జాషువా కూటం గారు క్రొత్త ఢిల్లీకి వెళ్లి అచ్చట ఒకవారం దినములుండి రేడియో ప్రసంగములను రికార్డు చేసిరి. వారు తిరిగి వచ్చేటప్పుడు J. C. ఛోటే దంపతులను వెంట బెట్టుకొని 12వ తేదీ సాయంకాలానికి కాకినాడ చేరుకొనిరి.

13వ తేదీ ఆదివారం ఆరాధనలో Bro. J. C. ఛోటేగారు గొప్ప ప్రసంగమును చేసిరి. మనము దేవుని ఆజ్ఞలను గైకొనవలసిన వారమని, ఆయన ఆజ్ఞలు భారమైనవికావని ఆయన ఉద్బోధించిరి. ఆ దినమందు స్థానిక సంఘమునకు హాజరగుచున్న ముగ్గురు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆరాధన యనంతరం సోదరి బెట్టీ ఛోటే స్థానిక సంఘ స్త్రీల సమావేశములో వాక్యోపదేశము చేసిరి.

J. C. ఛోటే దంపతులు 13వ తేదీ ఆదివారం రాత్రి జగన్నాథగిరిలోను, 14వ తేదీ రాత్రి పెద్దాపురం సమీపములోనున్న గుడివాడ సంఘములోను, 16వ తేదీ రాత్రి పెద్దపల్లలోను జరిగిన సువార్త కూటములలో పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. సోదరులు P. ప్రకాశం, T. Ch. ఫ్లెమింగ్స్, మరియు గుమ్మడి ఇశ్రాయేలు గార్లు ఆయా గ్రామములలో ఛోటే దంపతులకు మంచి ఆతిథ్యమిచ్చి సత్కరించిరి, పెదపల్లలో రాత్రి పదిగంటల సమయాన 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

* * * *

నవంబరు నెల సువార్తికుల సదస్సు 15వ తేదీ మంగళవారం నాడు కాకినాడలోని సత్యవాణి బిల్డింగ్‌లో అత్యంతఘనముగా జరిగెను. ఈ సదస్సుకు ఆంధ్రలోని పలుప్రాంతములనుండి 350 కంటె పైగా హాజరయ్యారు. అమెరికానుండి జె. సి. ఛోటే దంపతులు

[తరువాయి టైటిల్ 3వ పేజీలో

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 డిశంబరు 1994 సంచిక 5


## సంపాదకీయము

### మానవుడు నైతికస్వేచ్ఛ కలిగినవాడు

### ( Man, a Free Moral Agent )

దేవుడు మానవుని సృజించినప్పుడు అతన్ని ఒక యాంత్రిక జీవిగా గాక నైతిక స్వేచ్ఛను కలిగినవానిగా అతనిని చేసెను. మానవుడొక నైతిక జీవి. అతనికి ఒక అంతరాత్మ, లేక మనస్సాక్షి యున్నది. అతడేదైనా చెడ్డపని చేస్తే అతని మనస్సాక్షి గద్దించును, మంచి చేస్తే అది సంతోషించును, ఆదరణ ననుగ్రహించును. అందువలన మానవులు వారి దైనందిన జీవితాల్లో నైతిక సూత్రములను లేక నైతిక కట్టడలను కలిగి తమ మనస్సాక్షిని బట్టి జీవించ ప్రయత్నిస్తారు.

మానవుడు నైతికంగా స్వేచ్ఛ కలవాడు అని మనం చెప్పుకొన్నాం. అంటే అతడు మంచి - చెడుగు ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకొనడానికి స్వేచ్ఛ కలిగినవాడు. మానవుడు విధేయత చూపు

టకుగాని, అవిధేయత చూపుటకుగాని సంపూర్ణ బాధ్యతగలవానిగా దేవుడతని సృజించెను. ఒకవేళ మానవుడు అవిధేయత చూపి, పాపము చేసి నిత్యనాశనములోనికి పోయినను, దేవుడు న్యాయవంతుడగును.

## జీవమరణముల ఎంపిక

మానవునికి ఎంపిక చేసుకొనే హక్కును దేవుడతనికి అనుగ్రహించెనని బైబిలు చెప్పుచున్నది. మీరు ఎవరిని సేవించెదరో నేడు కోరుకొనుడి. అయితే నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అని ఇశ్రాయేలీయులకు యెహోషువ హెచ్చరిక చేసాడు (యెహోషువ 24:15). మానవులకు దేవుడు తన ఆజ్ఞలను తెలియజేసి, వారు వాటికి లోబడాలని కోరును. "నేడు జీవమును, మరణమును ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుట ఉంచి, భూమ్యాకాశములను మీమీద సాక్షులుగా పిలుచుచున్నాను" అని ఆయన ఇశ్రాయేలీయులకు చెప్పెను (ద్వితీ 30 : 19).

"మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి, ఫరో కుమార్తె యొక్క కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు" (హెబ్రీ 11 : 25). "ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయునని" అతడెరుగును (గలతీ 6:8). క్రైస్తవుడు శోధింపబడునప్పుడు, దానిని తప్పించుకొనే మార్గమును దేవుడు కలుగజేయును గాని, తప్పించుకోవాలో, వద్దో మానవుడు ఎంచుకొనాలి.

మోషే దేవునితో ఉండుటకు ఎంచుకొంటే, యితరులు దుష్టత్వాన్ని ఎంచుకొన్నారు. "ఏలయనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తు

వాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (గలతీ 6:8). "వారు గాలిని విత్తియున్నారు గనుక ప్రళయవాయువు వారికి కోత యగును" (హోషేయ 8 : 7). "నేను చూచినంతవరకు అక్రమమును దున్ని కీడును విత్తువారు దానినే కోయుదురు" (యోబు 4 : 8). "అయితే నేను దేవుని నాశ్రయించుదును. దేవునికే నా వ్యాజ్యమును అప్పగించుదును" అని యోబు చెప్పుచున్నాడు (యోబు 5:8).

## ఆత్మ రక్షణకొరకు

మానవుని ఆత్మ రక్షణ విషయములో కూడ, అతనికి ఎంపిక చేసుకొనే హక్కు వున్నది. మానవులకు దేవుడు తన ఆజ్ఞల నిచ్చాడు. వాటికి లోబడే తరుణాన్ని మానవులు కలిగి యున్నారు. పెంతెకొస్తు దినమందు పేతురు ఆనాటి యూదులకు ఒక తరుణం యిచ్చాడు. "మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడి" యని అతడు వారిని హెచ్చరించాడు (అపో.కా. 2:40). "మీరు మార్పు నొంది తిరుగుడి" యని మరొకమారు అతడు హెచ్చరించాడు (అపో. కా. 3:19). "మీరు భయముతోను, వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించు కొనుడి" యని ఫిలిప్పయిలోని క్రైస్తవులను పౌలు హెచ్చరించాడు (ఫిలిప్పీ 2:12). "అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి" యని పేతురు క్రైస్తవులను హెచ్చరించాడు (II పేతురు 1 : 10).

## ఎందుకు ఎంచుకోవాలి?

ఈ ఎంపిక, నిశ్చయతలకు కారణము లేకపోలేదు. మనలో ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరును మారుమనస్సు పొందవలెనని దేవుడు మనయెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు

(2 పేతురు 3:9). అయినను ఆయన నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు (అపొ.కా. 17:31). మానవులు దేవునికి లోబడుటకు ఎంచుకొనకపోయిన యెడల వారు నిత్యనాశనములోనికి పోవుదురు. "నేను పిలువగా మీరు వినక పోతిరి. నా చేయి చాపగా ఎవరును లక్ష్యపెట్టక పోయిరి. నేను చెప్పిన బోధ యేమియు మీరు వినక త్రోసివేసితిరి. నేను గద్దింపగా లోబడక పోతిరి. కాబట్టి మీకు అపాయము కలుగునప్పుడు నేను నవ్వెదను మీకు భయము వచ్చునప్పుడు నేను అపహాస్యము చేసెదను. మీకు కష్టమును దుఃఖమును ప్రాప్తించునప్పుడు నేను అపహాస్యముచేసెదను అని సర్వజ్ఞానియైన దేవుడు సెలవిచ్చుచున్నాడు (సామె 1:24-27) గనుక మనము నిత్యత్వాన్ని ఎక్కడ, ఎట్లు గడపాలో మనమే నిర్ణయించుకోవాలి. అది నిర్ణయించుకొనే స్వేచ్ఛను దేవుడు మనకిచ్చి యున్నాడు. ఆయన జీవాన్ని, మరణాన్ని కూడ మనముందుం యున్నాడు. ఆయన ఆజ్ఞలచొప్పున నడుచుకొంటే జీవములో ప్రవేశించ దుము. ఆయన ఆజ్ఞలను నిరాకరిస్తే మరణములో ప్రవేశించుదుము

యేసు ప్రభువు "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును ఆ దారి విశాలమునై యున్నది దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆ దారి సంకుచితమునై యున్నది. దాని కనుగొనువారు కొందరే" యని బోధించారు (మత్తయి 7:13, 14). మరియు "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవ డును తండ్రియొద్దకు రాడు" అని చెప్పారు (యోహా 14:6). "మరల యేసు-నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని" చెప్పెను (యోహాను 8:12)

మరల, సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షిం

బడును; నమ్మనోల్ల నివానికి శిక్ష విధింపబడునని" ఆయన చెప్పారు. వీట న్నిటిలోను నిర్ణయించుకొనే అధికారము మనకే విడిచిపెట్టబడినది. అయితే అన్ని విషయములలోను మనం శ్రేష్టమైన సంగతులనే ఎంచు కొనాలని ఆయన కోరుచున్నాడు. ఆయన ఎవరిని బలవంతము చేయడు. అందువలననే మనకు నైతిక స్వేచ్ఛను అనుగ్రహించాడు. దేవుడు నీకిచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకొని నిత్యజీవంలో ప్రవేశించుటకు నీవు ఎందుకు ఎంచుకొనకూడదు?

— o —

## క్రీస్తు దాసులు

## (Christ's Bondservants)

క్రీస్తు సంఘము రాజులు, రాణులతో గాక పరిచారకులతో సమకూర్చబడి యున్నది. మన రక్షకుడును సంఘమునకు శిరస్సునైన క్రీస్తు ఇట్లు చెప్పెను: "మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. ఆలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుట కును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెను" (మత్తయి 20:27-28). అందువలననే అపొ. పౌలు ఈ దిగువ మాటలను చెప్పగలిగాడు: "కక్షచేతనైనను, వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే గాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ 2:3, 4).

సంఘము క్రీస్తు సేవకులతో సమకూడి యున్నదనే దృక్పథాన్ని మనం కలిగి యుండకపోతే నిజ క్రీస్తుసంఘముయొక్క తత్వాన్ని మనం ఎరిగినవారము కాము. సంఘముయొక్క భావార్థములో 'సేవక

త్వము' యిమిడి యున్నది. ఈ తలంపు సంఘముయొక్క స్థాపకుడు, పునాదియైన క్రీస్తుతో ఆరంభమై ప్రతి సభ్యునికి అనేక పరిమాణము సేర్పరచుచున్నది. క్రీస్తు సంఘమునని చెప్పుకొనుచు ఈ లోకంలో పరిచార ధర్మము నిర్వర్తించని ఏ సంఘమైనను క్రీస్తుసంఘము కానేరదు. సంఘానికి ఈ లక్షణము అతి ప్రాముఖ్యమైనది గనుక క్రీస్తు సంఘమైన మనము క్రీస్తుయొక్క దాసుల మెట్లయ్యామో జాగ్రత్తగ గమనించవలెను.

## మన కర్తవ్యములో

మొదటిగా మన కర్తవ్యములో దాసులమని మనము గ్రహించాలి. సంఘము క్రొత్త నిబంధనలో వర్ణించబడిన విధానమునుబట్టి క్రీస్తు పరిచారకులతో అది సమకూడి యున్నదని తెలిసికోగలము. తన ప్రజలు పరిచారకులై యుండాలని క్రీస్తు కోరియున్నాడు. లేకపోతే సంఘాన్ని ఆయన అట్లు వర్ణించియుండకపోవును. తన అనుచరుల మధ్య ఘనత గలవాడు సేవకుడని క్రీస్తు చిత్రీకరించారు. "అన్యజనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురనియు, వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురనియు మీకు తెలియును. మీలో ఆలాగుండకూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండ గోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను" (మత్తయి 20:25, 26). గొప్పతనము పరిచర్య చేయుటలోనే తప్ప ఉద్యోగాన్ని బట్టిగాని, ధనాన్నిబట్టిగాని కాదని క్రీస్తుయొక్క భావమై యున్నది.

పాపి మార్పు జెందునప్పుడు దేవుని యొక్కయు, క్రీస్తు యొక్కయు దాసుడవునని పౌలు చిత్రీకరించాడు. మార్పు జెందక ముందు మనము పాపముకు దాసులము గాని మార్పు జెందిన తరువాత నీతికి దాసులమైతిమి (రోమా 6:17, 18). క్రైస్తవులు దేవుని యొక్క సొత్తు. వారు తమకు గాక దేవునికి చెందినవారు (1 కొరింథీ

6:20). మనము బ్రతికియున్నను చచ్చినను ప్రభువువారమే: "మనలో ఎవడును తనకోసరమే బ్రతుకడు, ఎవడును తన కోసరమే చనిపోడు. మనము బ్రదికినను ప్రభువుకోసరమే బ్రదుకుచున్నాము. చనిపోయినను ప్రభువుకోసరమే చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రదికినను, చనిపోయినను ప్రభువువారమై యున్నాము" (రోమా 14:7, 8).

మనము దేవునికిని, క్రీస్తుకును దాసులమై యున్నామను భావము మనము ఒండొరులకు చేయు పరిచర్యలో సహజముగా కనబడును. అందువలన "క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడి యుండుడి" యని చెప్పబడినది (ఎఫెసీ 5 : 2 ). మన స్వంత మార్గమునే కోరుకొనక, ఎల్లప్పుడు మన సహోదరుని ఆత్మీయ క్షేమాన్ని కోరుచు జీవించాలి. పౌలు ఇట్లు వ్రాసాడు: "నీ సహోదరులు నీ భోజన మూలముగా దుఃఖించిన యెడల నీవికను ప్రేమ కలిగి నడుచుకొనువాడవు కావు. ఎవనికొరకు క్రీస్తు చనిపోయెనో వానిని నీ భోజనముచేత పాడు చేయకుము . ఈ విషయమందు క్రీస్తుకు దాసుడైనవాడు దేవునికి ఇష్టుడును మనుష్యుల దృష్టికి యోగ్యుడునై యున్నాడు" (రోమా 14 : 15, 13). అందువలన క్రీస్తు పరిచారకులుగా "సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగముగలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" యని ఆజ్ఞాపింపబడితిమి (రోమా 12 : 10). "సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒక మాట, ఆ స్వాతంత్ర్యమును శారీర క్రియలకు హేతువు చేసికొనక ప్రేమ కలిగినవారై యొకనికొకడు దాసులై యుండుడి" యని కూడ ఆజ్ఞాపింపబడితిమి (గలతీ 5 : 13).

క్రీస్తుయొక్క చిత్తమును జరిగించుటకు ఆయన దాసులు ఈ లోకమందున్నారు. వారాయన సువార్తను ప్రకటిస్తారు, గాని, వారి

సువార్తను కాదు. వారు ఆయన పనిని సంపూర్ణము చేయ ప్రయత్నిస్తారు గాని వారి స్వంత కార్యక్రమములను కాదు. పౌలుతో కలసి వారిట్లందురు: "ఇప్పుడు నేను మనుష్యుల దయను సంపాదించుకొనజూచుచున్నానా దేవుని దయను సంపాదించుకొన జూచుచున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్ట గోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోషపెట్టువాడనైతే క్రీస్తు దాసుడను కాకయే పోవుదును" (గలతీ 1:10).

నిజానికి మనము దాసులము కాకమునుపు దాసులు ఆలోచించునట్లు ఆలోచించాలి. దాసుల ఆలోచనలను అభ్యాసము చేద్దాం. దీనిలో నాకేమి సమకూడును? అని అడుగక నా సహోదరునికి నేనెట్లు సహాయపడగలను? క్రీస్తులో అతడు ఎదుగుటకు, విశ్వాసములో బలపడుటకు అతనికేమి కావాలి? అని అడుగుదాం. ప్రభువా, ఈ మధ్య నీవు నాకేమి చేశావు? అని అడుగుటకంటే, ప్రభువా యిదిగో నేనున్నాను, నన్ను పంపించుమని చెబుదాం.

## కోరికలో

కర్తవ్యములో మనము దాసులమే గాక మన కోరికలో కూడ దాసులమై యున్నాము. ఆయన సత్యసంఘానికి మరొక కాంక్ష లేదు. అన్నిటికంటె పైగా ఆయన ప్రజలు ఆయన సేవ చేయుటకు కోరుకొందురు. క్రీస్తు రాకముందు మనకు నిరీక్షణ అంటూ యేమీలేక నిత్య నిస్పృహను కలిగియుంటిమి. ఏ మానవుడు మనకు సహాయము చేయలేక యుండెను. ఈ లోకంలోని విశ్వవిద్యాలయములన్నియు, జ్ఞానమంతయు కూడ మనం విమోచింపబడే సంకల్పాన్ని తయారుచేయలేకపోయిరి. దేవుడే కలుగజేసికొనకపోతే మనకు విమోచన అంటూ లేకపోయేది. అయితే మన రక్షకునిగా క్రీస్తును దేవుడు ఈ లోకానికి పంపించెను. దైవత్వములో ఒక వ్యక్తి అయినను ఆయన సంపూర్తిగ

మానవుడాయెను. ఆయన తన నిత్య మహిమను వీడి, మనకొరకు మరణమును రుచిచూచునట్లు మనలో ఒకనివంటి వాడాయెను (హెబీ 2:9). ఆయన పరలోక వైభవాన్ని నిస్వార్థరహితముగా త్యజించి, భూలోక నిందను భరించెను. మన వలెనే ఆయన బాధింపబడినను, మనవలెనే ఆయన మరణమునకు గురి ఆయెను. అంతమాత్రమున ఆయన పరిపూర్ణ మానవుడాయెను. ఆయన తన పరిపూర్ణ జీవితాన్ని మన యెదుట ప్రదర్శించి, తన ప్రాణాన్ని పాపబలియాగముగా అర్పించెను. మన పాపపు అపరాధములను పాపములేని దేవుని కుమారుడు మాత్రమే తీర్చగలిగెను.

అందువలన మాటలలో వర్ణించలేనంతగా మనము క్రీస్తుకు ఋణపడి యున్నాము. మొదటిగా, ఆయన నుండి విమోచనను, పొందియున్నాము. "ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనను, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది" (ఎఫెసీ 1 : 7). రెండవదిగా మన మాయన నుండి ఉచిత దానమును పొందియున్నాము. మన ఆస్తులు, తలాంతులు ఆయన నుండి పొందిన ప్రశస్త బహుమానములే: "నీకు ఆధిక్యము కలుగజేయు వాడెవ్వడు? నీకు కలిగినవాటిలో పరుని వలన నీవు పొందనిది ఏది? పొందియుండియు పొందనట్లు నీవు అతిశయింపనేల?" (1 కొరింథీ 4:7). మూడవదిగా ఆయన మనకొక గుర్తింపు ననుగ్రహించి యున్నాడు. ఆయన రక్తము వలన విమోచింపబడి, ఆయన కృపవలన ఆయన సేవకొరకు ప్రతిష్ఠింపబడి మనమాయన గృహనిర్వాహకుల మయ్యాము. మనము సంపూర్తిగ ఆయనకు చెందినవారము. మన కున్న దేదియు మన సొంతమే యని ఎన్నడు ఆరోపించుకోము. మన తల వెండ్రుకలనుండి, మన కాలి గోరులవరకు యావత్తు ఆయన సొత్తు మాత్రమే. ఆయనకు సేవచేయుటయే మన ఏకైక కోరిక. ఆయన మన కొరకు చేసిన దానిని బట్టి మనకు వేరొక మార్గము లేదు.

క్రీస్తు దాసుడుగా యుండుటకు కాంక్షించని క్రైస్తవు డెవడైనను, అతడు క్రీస్తుకు అచ్చియున్న దేదో అంచనా వేసినవాడుకాడు. ఆయన లేకుండ మనమేమియు లేము. క్రీస్తు మనకు చేసిన దాని గ్రహింపు దినదినము ఆయనకు పరిచర్య చేస్తు కృతజ్ఞులమై యుండుటకు దోహదము చేస్తాది.

## నిర్ధారణలో

మూడవదిగా, క్రీస్తు సంఘమైన మనము నిర్ధారణలో ఆయన సేవకులము. మనము జీవించు జీవితము, చేయు కృషి, ప్రకటించు వర్తమానము సేవకుని తత్వాన్ని ప్రతిబింబింప జేయును. సేవ చేయుటయే ఎల్లవేళలా క్రైస్తవుని హృదయ వాంఛయై యున్నది. ఇది నిజము. ఎందువలననగా క్రైస్తవ జీవితము 'క్రీస్తు మనలో జీవితమై' యున్నది. మరియు ఈ లోకంలో క్రీస్తుకంటె ఘనుడైన పరిచారకుడు మరొకడు లేడు. పౌలు ఇట్లు వ్రాసాడు: "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేనుకాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించు జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2 : 20). అందువలన పౌలు దాసుని జీవితం జీవించుటలో మనకు ఆశ్చర్యము లేదు. అతడు నిస్వార్థపరుడు, పరుల సేవకుడేగాని స్వార్థపరుడుగాని స్వలాభాపేక్ష గలవాడుగాని కాడు. "క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి" యని అతడు మనకు వ్రాసాడు (ఫిలిప్పీ 2 : 5). మనమతని హెచ్చరిక ననుసరించి క్రీస్తు మనస్సును కలిగియుంటే మనము యితరులను గూర్చి ఆలోచిస్తాము. వారికొరకు జీవిస్తాము: "ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచు

కొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:6-8).

తన్ను తాను రిక్తునిగా జేసికొనేది క్రీస్తు స్వభావము. ఆయన తన పరలోక మహిమను పరిత్యజించి, మానవుల దాసుడై, తన సొంత సృష్టియైన మానవుని రక్షణ కొరకు సిలువను సయితము సహించెను. మనమాయన మనస్సుగలవారమైతే మానవుల పరిచారకులుగా గాక వేరొక ధర్మమును నిర్వర్తించలేము.

క్రీస్తు తన ప్రజలకిచ్చిన కర్తవ్యాన్ని దాసుని స్వభావము లేకుండా ఆయన ప్రజలు నిర్వర్తించలేరు. పరిమితిగల ఆజ్ఞలనిచ్చి క్రీస్తు తన వారిని పంపుచు, "ఉచితముగా పొందితిరి, ఉచితముగా ఇయ్యుడి" అనెను (మత్తయి 10:8). ఆఖరిగా తన సార్వజనిక ఆజ్ఞను శిష్యులకిస్తూ "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" యని చెప్పి సేవకత్వాన్ని ఆయన ఆదేశించెను (మార్కు 16 : 15). ఆయన ఆజ్ఞను నెరవేర్చుటకు గాను మనలో అనేకులు బంధువులను, మిత్రులను, ఇండ్లను, ఆస్తులను విడిచిపెట్టుటకు ఇష్టపడాలి. మిగిలిన వారు తమ ధనాన్ని క్రీస్తుకొరకు వెచ్చిస్తు, ఆయా ప్రాంతములకు, దేశములకు వెళ్ళుచున్న వారిని ప్రోత్సహించాలి. వెళ్లుచున్న వారు, వారిని పంపుచున్న వారు పరిచార ధర్మమును నిర్వర్తించుదురు. సువార్త కొరకై విదేశాలకు వెళ్లువారు ధనవంతులగుటకు వెళ్ళరు. ధనాన్ని యిచ్చుచున్న వారుకూడ ధనవంతులగుటకు ఇయ్యరు. వీరిద్దరు క్రీస్తు దాసులు చేయుదానినే చేయుదురు.

మనము ప్రకటించు వర్తమానము మనదికాదు. ఉత్తరాన్ని

మనం వ్రాయలేదు. మనము క్రీస్తు వ్రాసిన ఉత్తరాన్ని అందించే సేవకులము మాత్రమే. ఆయన పంపిన వర్తమానము కలుషితము గాకుండ, తారుమారు కాకుండ చూచే బాధ్యత మనది దానిని తిరిగి వ్రాయాలనే ఆజ్ఞను మన రాజు మనకియ్యలేదు. అది ఉన్నది ఉన్నట్లుగానే అందజేయబడాలని మాత్రమే ఆయననుండి మనము ఆజ్ఞను పొందితిమి. ఈ వర్తమానము లేకుండా ఈ లోకము నశించిపోవునని మన మెరుగుదుము. అందువలన ప్రేమపూర్వకమైన ఆసక్తిగలవారమై ఈ వర్తమానాన్ని రేడియో, టి.వి. ల ద్వారా ప్రసంగవేదికలు కరపత్రములద్వారా, వ్యక్తిగత పరిచర్యద్వారా అందరికీ అందించుటకు ప్రయత్నించుచున్నాము. మన వ్యక్తిగత సౌకర్యములకంటె ముందు ఆయన వర్తమానాన్ని ఉంచుతాము. దాని ప్రచురము నిమిత్తము మనం మన తలాంతులను, ధనాన్ని, సమయాన్ని, మన మేధస్సును, చేతులను, కాళ్ళను, అవును మన హృదయాలను సమర్పిస్తాము.

రాజు లందరికంటె మన రాజు భిన్నమైనవాడు! ఆయన రాజులకు రాజును, ఈ విశ్వసృష్టికర్తయు, దాని కొనసాగించువాడనైనను, ఆయన ఒక దాసునివలె మన మధ్య జీవించెను. ఈ గొప్ప సత్యము యేసుప్రభువు తన శిష్యుల పాదములు కడిగిన సందర్భములో ప్రత్యేకముగా ప్రకాశించుచున్నది (యోహాను 13:1-16). ఈ భూసంబంధమైన రాజెవడైనను తన ప్రజల యొద్దకు వస్తే వారాయనకు సాగిలపడుదురు. ఆయనను ముట్టుకొనడానికి తహతహ లాడుదురు. అయితే క్రీస్తు చనిపోవకముందు రాత్రి నీళ్ళతో నింపబడిన పళ్ళెమును పట్టుకొని ఆయన తన శిష్యుల పాదములు కడిగెను.

ఆయన వారి పాదముల నెందుకు కడిగెను? మరింకెవరు లేక కాదు. ఆయన కడుగవలసి వచ్చిందనికూడ కాదు. ఈ ఉదాహరణ

తన శిష్యులకు విలువైనదిగా యుంటాదని ఆయన కడుగలేదు. ఆయన మానవుల పరిచారకుడైన దేవుని కుమారుడు గనుక ఆయన వారి పాదములు కడిగెను! ఆయన ఒక దాసుని వలె వచ్చెను. దాసునివలె జీవించెను, దాసునివలె మరణించెను. తినుట, నడుచుట ఎంత సహజమో యితరులకు పరిచర్య చేయడం ఆయనకంత సహజము. మన మెవర మయ్యున్నామో దానిని బట్టి ఆయన అనుచరులనుకూడ అట్టి విధమైన జీవితానికే పిలుచుచున్నాడు (యోహాను 13:13-16).

యేసు నడిచినట్లు మనం నడవాలి. యితరులకు పరిచర్యచేయ కుండా మనం క్రైస్తవ జీవితాన్ని జీవించలేము. క్రైస్తవ జీవితము, సేవకధర్మ మురెండు ఒకదానితో నొకటి ముడిపడి యున్నవి. దాసుని జీవితం ఎట్లు జీవించాలో యని నీవాలోచించుచున్న యెడల, క్రీస్తు యేమి చేసెనో దానినే చేయుము. దాసునిగా యుండకుండా ఆయన చిత్తాన్ని నీవు నెరవేర్చలేవని తెలిసికొందువు. నీవు దాసుడవు కాక పోతే ఆయన కోరిన రీతిగా యితరులకు సువార్తను బోధించలేవు. దాసుడవు కాకపోతే ఆయన కోరిన రీతిగా బీదలను ఆదరించలేవు. దాసుని హృదయం లేకుండా ఆయన నీకిచ్చిన పనిని సంపూర్తి చేయలేవు.

## ముగింపు

క్రీస్తుసంఘము క్రీస్తు దాసులతో సమకూడి యున్నదని క్రొత్త నిబంధన విశదీకరించు చున్నది. మన కర్తవ్యములోను, కోరికలోను, నిర్ధారణలోను మనం సేవకులమే. క్రీస్తు సిలువయొద్ద అందరు సమానులే. ఒక దాసుడు మరొక దాసునికి పైగా లేడు; ఒక దాసుడు మరొకని క్రింద లేడు. మనందరము సేవకులమే. తలదువ్వుకొనుట, నడుచుట మొదలగునవి ఎంత సహజమో క్రీస్తుయొక్క అనుచరులకు పరిచర్య చేయుట అంత సహజము. మన జీవితాలు స్వీయ కాంక్షల కేంద్రీ

కృతములు గాక, దేవుని కుమారుని కే కేంద్రీకృతములు. దీనియొక్క భావము ఒకే ఒక్కటి-సేవకత్వము.

పాపులు రక్షింపబడి, దేవుని దాసులగునట్లు క్రీస్తు ఆహ్వానించుచున్నాడు. ఆయన 'రండి' యని పిలుచుచున్నాడు (మత్తయి 11:28). మరియు 'వెళ్లుడి' యని ఆజ్ఞాపించుచున్నాడు (మత్తయి 28 : 19, 20). ఆయనయొద్దకు వచ్చినవారి నెవరినైనను ఆయన అంగీకరించును. అయితే అతడు ఎట్లు వచ్చాడో అట్లే యుండుటకు అయన అంగీకరించడు. పాపులమైన మనలను ఆయన అంగీకరిస్తాడు గాని యితరులకు సేవ చేయునట్లు మనలను మార్పుచేస్తాడు. గనుక ఆయన సత్య సంఘము దాసుడైనవాని దాసులై యున్నారు. నీవు క్రీస్తు దాసుడవా!

—ఎడ్డీ క్లోర్, (TFT)

— o —

కొండమీద ప్రసంగము-10

## మీరు లోకమునకు వెలుగై యున్నారు

## ( Ye are the Light of the World )

మత్తయి 5 : 14-16

యేసు తన శిష్యుల నుద్దేశిస్తు "మీరు లోకమునకు వెలుగై యున్నారు. కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి మంచము క్రింద పెట్టరు కాని అది యింటనుండు వారందరికి వెలుగిచ్చుటకై దీపస్థంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి" యని బోధించారు (మత్తయి 5:14-16).

మన సూర్య కుటుంబములోని గ్రహము లన్నియు సూర్యుని

చుట్టు పరిభ్రమించుచు సూర్యుని నుండి వెలుగును పొందుచు, ఆ వెలుగును ప్రతిబింబింప జేయుచున్నవి. క్రీస్తును గూర్చియు, ఆయన అనుచరులైన క్రైస్తవులను గూర్చియు యిదే సత్యాన్ని మనం చెప్పకోవచ్చును. మనం క్రీస్తునుండి వెలుగును పొందుచున్నాము. ఆ వెలుగును దేవుని మహిమార్థం ప్రజల యెదుట ప్రకాశించాలి.

యేసు ప్రభువు ఇట్లు చెప్పారు: "నేను లోకమునకు వెలుగును; నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండును" (యోహాను 8 : 12). "నా నామమందు భయభక్తులు గల వారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును; అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయునని" యెహోవా దేవుడు సెలవిచ్చి యున్నాడు (మలాకీ 4:2). "భూ దిగంతముల వరకు నీవు నేను కలుగజేయు రక్షణకు సాధన మగుటకై అన్యజనులకు వెలుగై యుండునట్లు నిన్ను నియమించి యున్నానని" క్రీస్తు యేసును గూర్చి యెషయా ప్రవచించాడు (యెష 49:6). "ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెనని" యోహాను 1:4 చెప్పుచున్నది. "నిజమైన వెలుగు ఉండెను; అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించు చున్నది" (యోహాను 1:9). క్రైస్తవుల నుద్దేశించుచు, అపొ. పౌలు, "మీరందరు వెలుగు సంబంధులును పగటిసంబంధులునై యున్నారు. మనము రాత్రివారము కాము, చీకటివారము కాము" అని చెప్పెను (1 థెస్స5:5). గనుక లేఖనాల్లో క్రీస్తును ఆయన అనుచరులును వెలుగుగాను వెలుగుసంబంధు లుగాను దేవుడు ఎందుకు పోల్చియున్నాడో మనము గ్రహించుకొన వచ్చును. దేవుని నుండి మానవునికి కలిగిన యీవులన్నిటిలోను శ్రేష్టమైనది వెలుగు. వెలుగు వలన జీవము లేక జీవనము సాధ్యమగుచున్నది. వెలుగు రోగముల నరికట్టును. పెరుగుదలను ప్రోత్సహించును. వెలుగు చాల చురుకైనది. అది ఒక సెకనుకు

1,86000 వేల మైళ్లు ప్రయాణించును. వెలుగు వలన చెప్పరానంత శక్తి ఉద్భవించును. నేడు పలుచోట్ల సూర్యరశ్మిని విద్యుచ్ఛక్తిగా మార్చి అనేక పనులను మానవులు సాధించుచున్నారు.

## శ్రేష్ఠమైన వెలుగు

వెలుగు వలన మనం చూడగలుగుచున్నాము, చలించగలుగుచున్నాము. చీకటిలో సంచరించుటకు దేవుడు మనలను సృజించలేదు. భూమ్యాకాశములను దేవుడు ఆదిలో సృజించిన తరువాత, మొదటిగా వెలుగును సృజించెను. అది మంచిదై యున్నట్లు దేవుడు చూచెను. వెలుగు సంతోషాన్ని ఆదరణను కలుగజేయును. "సాయంకాలమున ఏడ్పు వచ్చి రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును". (కీర్తన 30 : 5). వెలుగు పవిత్రమైనది. భూమిమీద వృక్షజాతి సంబంధమైన జీవమున కంతటికిని పరోక్షముగా జంతు, మానవ జాతుల జీవమునకును వెలుగు అత్యావసరం. సూర్యరశ్మి సహాయవలన ఫోటోసింథసిస్ అను ప్రక్రియ మూలంగా చెట్లు తమకు ఆహారము తయారు చేసికొనుట మాత్రమే గాక, మనకు ప్రాణవాయువునుకూడ తయారుచేసి యిచ్చుచున్నవి. సూర్యుని వెలుగు పడనిచోట మొక్కలు సాధారణంగా మొలకెత్తవు.

వెలుగు చేయు పని సాఫీగా, ఒడుదుడుకు లేకుండా యుంటాది. సూర్యుడు తన పనిని ఖచ్చితంగా, నెమ్మదిగా చేసుకుంటూనే యుంటాడు. అంతేకాదు వెలుగు మెలకువ కలుగజేస్తాది. మనం రాత్రంతయు ఎంత గాఢంగా నిద్రపోయినా సూర్యోదయం కాగానే మెలకువ తెచ్చుకొని నిద్రనుండి లేస్తాము. నీతి సూర్యుడైన యేసుప్రభువు నిద్రపోవుచున్న మానవుని ఆత్మను లేపి లోకాన్ని వెలిగించుటలో ఒక భాగస్వామిగా చేసియున్నాడు. "అందుచేత-నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని

ఆయన చెప్పుచున్నాడు" (ఎఫెసీ 5:14). గనుకనే క్రీస్తు మీరు లోకమునకు వెలుగై యున్నారని బోధించెను. భౌతిక ప్రపంచము క్రమంగా చలించాలంటే వెలుగెంత అవుసరమో, ఆత్మీయ నైతిక జీవనము క్రమముగా జరుగాలంటే క్రైస్తవుడు ప్రకాశించు వెలుగు అంత అవుసరమై యున్నది.

వెలుగు సంబంధులుగా యుంటూ ఈ లోకాన్ని ఆవరించుకొని యున్న చీకటిని చూచి మనం నిర్ఘాంతపోనవుసరం లేదు. నిజమే దుష్టశక్తులు నానాటికి ప్రబలుచున్నవి, దుర్మార్గత, అక్రమము, అవినీతి, పాపము ఈ లోకాన్ని ముంచివేయుచున్నవి. దీనినంతటిని చూచి ఈ లోక గతి యేమవునో యని మనం ఆలోచించవచ్చును. భక్తుడైన యోహాను ఈ చీకటిని గూర్చి ఎరిగినవాడే అయినను వెలుగుయొక్క ప్రాముఖ్యతను వక్కాణించాడు. ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తుకంటె ముందుగా వచ్చెను. "అతడా వెలుగై యుండలేదు గాని ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకు అతడు వచ్చెను. నిజమైన వెలుగు ఉండెను; అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది. ఆయన లోకములో ఉండెను. లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు" (యోహాను 1:8-10).

మన స్వాస్థ్యముయొక్క గొప్పతనాన్ని భక్తుడైన యోహాను జ్ఞాపకము చేయుచున్నాడు. ఈ లోకమంతా నైతిక, ఆత్మీయ చీకటిలో మునిగిపోయినను, క్రీస్తులోను, క్రీస్తుద్వారాను కలిగిన వెలుగును ఆ చీకటి ఎన్నడు ఆర్పివేయలేదు. నేను నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని యేసుప్రభువు చెప్పెను (మత్త 16:18). "పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని

పొందినవారికి గాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యము లన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగయుగములు నిలుచును" అని ప్రవక్తయైన దానియేలు చెప్పెను (దానియేలు 2:44).

## దేవుని వాక్యపు వెలుగు

క్రైస్తవ్య మారంభమైన నాటినుండి, నేటివరకు వారిలోయున్న వెలుగును నాశనం చేయాలని అపవాది అనేక ప్రయత్నాలు చేసాడు, చేస్తూనే యున్నాడు. బైబిలు గ్రంథాన్ని నాశనం చేయాలని అను కొన్నాడు, గాని వాని ప్రయత్నములు ఏమీా ఫలించలేదు. ఇంతకు ముందెన్నడు లేనంత ఎక్కువమంది నేడు క్రీస్తును, ఆయనలో యున్న వెలుగును తెలుసుకొనుచున్నారు. మున్నెన్నడు లేనంత ఎక్కువగా బైబిలు గ్రంథం అమ్ముడగుచున్నది, చదువబడుచున్నది. భక్తుడైన దావీదు ఇట్లు వ్రాసాడు: "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది". "నీ వాక్యము వెల్లడి యగుట తోడనే వెలుగు కలుగును. అవి తెలివి లేనివారికి తెలివి కలిగించును" (కీర్తన 119:105, 130).

దేవుని వాక్యపు వెలుగు తమమీాద ప్రకాశింపనివారు అంధ మైన మనస్సుగలవారై తమలోనున్న అజ్ఞానముచేత దేవుని వలన కలుగు జీవములో నుండి వేరు పరచబడినవారై తమ మనస్సుకు కలి గిన వ్యర్థత అనుసరించినడుచు కొనుచున్నారని అపొ.పౌలు. చెప్పాడు (ఎఫెసీ 4 : 17-19). యూదులు అజ్ఞానమువలన యేసు ప్రభువును సిలువవేసి చంపారని అపొ. పేతురు చెప్పాడు (అపొ.కా. 3 : 17). క్రైస్తవులు వెలుగు సంబంధులు గనుక అజ్ఞానాన్ని, మూర్ఖత్వమును దేవుని వాక్యాన్నిబట్టి వారు దూరపరచాలి. మానవులు పడుచున్న శ్రమ లన్నియు దేవుని వాక్యమునుండి, క్రీస్తు యేసునుండి వారు

దూరమవుటవలన కలుగుచున్నవని చెప్పవచ్చును. ప్రపంచములో జరుగుచున్న నరహత్యలు, వ్యభిచారములు, దొంగతనములు, మోస ములు, వగయిరా అన్నీ క్రీస్తునుండి ప్రజలు దూరమవుట వలన కలుగుచున్నవి,

క్రైస్తవుడు క్రీస్తు వెలుగును మనుష్యుల యెదుట ప్రకాశిం చాలి. అందుకే మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువా ర్తను ప్రకటించుడి యని ప్రభువు తన శిష్యుల నాజ్ఞాపించారు (మార్కు 16 : 15). ప్రజలకు వారు సువార్త వెలుగును చాటించి, తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మియ్యాలి. మరల ప్రభువు చెప్పిన సంగతు లన్నిటిని వారికి బోధించాలి (మత్త 28:18-20). ఇది ఎంత గొప్ప ధన్యతయో కదా!

మీరు లోకమునకు వెలుగై యున్నారు. కొండమీదనుండు పట్టణము మరుగై యుండనేరదు అని ప్రభువు చెప్పారు. నీవు క్రీస్తు లోని వెలుగును పొందిన యెడల దానిని యితరులకు కూడ ప్రసరింప జేయాలి. అందుకే ప్రభువు నిన్ను పిలిచాడు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగును ప్రకాశింపనీయుడి. లోకానికి క్రీస్తు సువార్తను చాటండి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. వాడు చీకటిలోనుండి వెలుగులోనికి దాటినవాడగును. "ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహా 1:7).

—జాషువా గూటం.

— o —

# విశ్వాసము

**పరిచయము:** "విశ్వాసము" అను అంశము చాలా ప్రాముఖ్యమైనది.

ఎ. క్రొత్తనిబంధనలో విశ్వాసము అను మాట 200 సార్లకంటె ఎక్కువగా ఉపయోగించబడెను.

బి. నమ్ము, నమ్మకము, నమ్మిక అను వివిధ రకములైన అర్థములు కలవు.

I క్రొత్త నిబంధనలో విశ్వాసము అను మాట రెండు విధములుగా వాడబడినది.

ఎ. విశ్వాసమనునది ఒక పదార్థము కాదు. మనకు ఉపదేశించబడినదేదో దానిని అభ్యసించు పద్ధతినే విశ్వాస మందురు.

1. "విశ్వాసమందు నిలకడగా ఉండుడి". 1 కొరింథీ 16 13.
2. "మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే పరీక్షించుకొనుడి". II కొరింథీ 13:5.

బి. ఒక వ్యక్తిపట్ల లేక సిద్ధాంతముపట్ల దృఢమైన నమ్మిక కలిగి యుండుటయే విశ్వాసమని అనేక పర్యాయములు చెప్పబడినది.

II విశ్వాసము ప్రాముఖ్యమైనది ఎందుకనగా.........

ఎ. మనము రక్షించబడుటకు విశ్వాసము అవసరము. యోహాను 3:16, 8:24; మార్కు 16:16; రోమా 5:1, 10:9-10.

బి. విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండలేము (హెబ్రీ 11 : 6).

III ఋజువులపై విశ్వాసము ఆధారపడియున్నది. (హెబ్రీ 11:1).

ఎ. దేవుడున్నాడని మనము ఎందుకు నమ్ముచున్నాము ?

1. ఋజువు.

ఎ. రోమా 1:18-20

బి. కీర్తన 19:1 "ఆకాశములు వివరించుచున్నవి........"

2. మనము దేవుని చూడలేదు, కాని నమ్ముచున్నాము.

ఎ. మనము క్రీస్తును నమ్ముటకు గల కారణ మేమనగా అనేకమైన నమ్మదగిన సాక్ష్యములు ఉండుటవలన. జూలియస్ సీజర్ యొక్క అధిక సాక్ష్యములు క్రీస్తుయొక్క ఉనికిని తెలియజేయుచున్నవి.

బి. మనకు బైబిలునందు ఎందుకు విశ్వాసము కల్గుచున్నది? అందు చూపబడిన ఋజువులు దేవుని నుండి కలిగినవి కనుక (ప్రవచనములు వాటి నెరవేర్పు, స్వవిరుద్ధమైన సంగతులు, తప్పులు లేవు).

IV జ్ఞానము, మరియు అభిప్రాయము, విశ్వాసముల మధ్య వ్యత్యాసము కలదు.

ఎ. అభిప్రాయములోని విషయములు ఏమనగా ఒక అభిప్రాయముకంటె వేరొక అభిప్రాయము మంచిదిగా యుండును.

ఉదా:- మోషే ఏవిధమైన పొదను మండుచుండగా చూచెను? దానిని గూర్చి బైబిలు చెప్పుటలేదు.

బి. బైబిలు మాత్రమే దేవుని సిద్ధాంతము, సత్యము, ఆధారమునై యున్నదను విషయములో విశ్వాసమున్నది.

సి. అభిప్రాయము, నాచేతిలో ఏమున్నదని నీవు తలంచుచున్నావు? విశ్వాసము : ఒక నాణెము నా గుప్పిలిలో వున్నది. నీవు నమ్ముచున్నావా?

జ్ఞానము : బోధకుని చేతిలో ఒక కాసును చూచితిని.

V విశ్వాస వీరుల అధ్యాయముగా హెబ్రీ 11 పిలువబడెను.

ఎ. వీరు తమ విశ్వాసముచేత దీవించబడిరి

హేబేలు, హనోకు, నోవహు, అబ్రహాము, శారా, ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే ఇశ్రాయేలీయులు.

బి. ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసముద్వారా తమ క్రియల అనంతరం ఆయా సమయములలో దేవుని ఆశీర్వాదములు పొందిరి (గలతీ 5:6).

VI క్రియలులేని విశ్వాసము ఏమగును? (యాకోబు 2:14-26).

ఎ. అది (2 : 14-16) నిష్ప్రయోజనమైనది.

బి. అది మృతమైనదగును (2:17).

సి. అది కనిపించదు (2:18).

డి. దీనికంటె దయ్యముల విశ్వాసము పర్వాలేదు (2:19).

ఇ. అది నిష్ఫలమైనది (2:20).

ఎఫ్. అది సంపూర్తికాదు (2:21-23).

జి. అది న్యాయము చేకూర్చదు (2:24-25).

హెచ్. అది మృతము (2:26).

ముగింపు:-మనము దేవునికి లోబడినప్పుడు విశ్వాసము రక్షించును.

—పి. చంద్రశేఖర్, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ.

—o—

## క్రిస్మస్ పండుగ

క్రిస్మస్ పండుగను ఆచరించమని గాని, దానికి ఆత్మీయ భావమున్నట్లు గాని, బైబిలులో ఎచ్చటనూ కనబడదు. గనుక క్రిస్మస్ ఎలా వచ్చినదో తెలుసుకొనుట అవసరమైయున్నది. ప్రపంచములోని ప్రొటెస్టాంట్ క్రైస్తవులు నూటికి తొంబై శాతము యేసుక్రీస్తు డిశంబరు 25న పుట్టినాడని భావించి క్రిస్మస్‌ను ఆచరిస్తు ఉండుట మనము చూస్తూ యున్నాము. క్రిస్మస్‌ను గూర్చిన అవగాహన లేకనే కొందరు దానిని ఆచరించుదురు.

### ఆచరణలోనికి ఎప్పుడు, ఎలా వచ్చింది ?

ఆనాటి ప్రపంచములో చక్రవర్తులు, రాజులూ క్రైస్తవ

మతాన్ని స్వీకరించిన కారణాన ఆనాడు సెలవు దినముగా ప్రకటించినారని చరిత్ర చెప్పుచున్నది. (క్రిస్మస్ పండుగ అనుమాట రోమన్ చక్రవర్తి కాన్స్టంటైన్ క్రైస్తవునిగా మారిన నాల్గవ శతాబ్దములో నుండియే వింటున్నాము. గాని అంతకముందెన్నడూ దానిని ఆచరించినట్లు కనబడదు.

శైవ గ్రంథమును, సామాజిక చరిత్రను కూలంకషముగా తరచిన పండితులే నేటివరకు క్రీస్తు ప్రభువుయొక్క పుట్టుక తేదీని నిర్ణయించలేక యున్నారు. అయితే రోమన్ కేథలిక్కు వారితో ప్రొటెస్టెంటు శాఖలవారూ దానిని ఆచరించడము విచారకరము.

డిశంబరు 25వ తేదీని ఒక పండుగగా క్రీస్తు పుట్టుకకు పూర్వమే రోమన్లు ఆచరించినట్లు చరిత్ర చెప్పుచున్నది.

ఆకాశరాణి అను ఒక దేవత వలన డిశంబరు 25న సూర్యుడు పుట్టినాడని వారు నమ్ముదురు.

బబులోనీయులు కూడా దీనిని 5 దినములు ఆచరిస్తారు. ఐగుప్తీయులు డిశంబరు 25న సూర్యదేవునికి, చంద్రదేవతకు నక్షత్ర దేవుడు పుట్టినాడు గాన వారు ఆ తేదీని పండుగగా ఆచరిస్తారు. అరేబియాలో సెబియన్ అను జాతివారు చంద్రదేవతను ఆరాధిస్తారు. చంద్రుడు అరేబియులు ఏడవ మాసమున (డిశంబరు 24వ తేదీన) పుట్టినాడని నమ్ముదురు. ఇలాగున డిశంబరు 25వ తేదీ ఉత్సవము బబులోనులో ఆరంభమై కాలాను గుణముగా రోమీయులలోనికి అన్య జనాంగములలోనికి వ్యాపించి, యీనాడు ప్రపంచ మంతటా అన్యదేవతల జన్మదినమైన డిశంబరు 25న క్రీస్తు పుట్టుక దినముగా జరుపుకొనుట వింతగానే యున్నప్పటికిని దీనిని దేవుడు ఎంతగా అసహ్యించుకొనుచున్నాడో చెప్పలేము.

## అయితే బైబిలు ఏమి చెప్పుచున్నది ?

నైవ గ్రంథములోగాని సంఘ చరిత్రయందు గాని సామ్రాజ్య చరిత్రలోగాని, క్రీస్తు డిశంబరు 25వ తేదీన పుట్టెనాడనుటకు ఏట్టి ఆధారమైనను లేదు. డిశంబరు మాసములో యూదయ దేశములో భయంకరమైన చలి. అలాంటప్పుడు గొల్లలు తమ పొలములో మందలు మేపుటకు వీలులేదు (లూకా 2 : 8). యీ వాస్తవము మనము గుర్తిస్తే క్రీస్తు జన్మించి నపుడు గొర్రెల మందలు పొలములో యున్నట్లు లేఖన భాగములో యున్నది గనుక అది డిశంబరు నెలలో కాదని నిశ్చయముగా చెప్పగలము.

పాతనిబంధన కాలములో ఇశ్రాయేలీయులకు ఆయా పండుగలను ఎప్పుడు, ఏలాగు చేయాలని ఆజ్ఞాపించిన దేవుడే తరువాత ఆమోసు కాలములో వాటిని ఖండించుచూ అవి నాకు అసహ్యమైనవని చెప్పుచున్నారు (ఆమోసు 5 : 21). క్రొత్తనిబంధనలో మొదటి శతాబ్దపు క్రైస్తవులు వాటిని వారసత్వముగా ఆచరిస్తు యుండుట పౌలు ఖండించినట్లు మనము గుర్తించగలము (గలతీ 5 : 10; కొలస్సి 2:16). మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములుగా భావించి ఆచరించువారి సేవ వ్యర్థమైనదని క్రీస్తు ప్రభువు చెప్పెను (మత్తయి 15 : 9).

గనుక మనకు చెప్పని దానిని, ఆజ్ఞాపించనిదానిని, దేవుని అసహ్యమైనదానిని, వ్యర్థమైనదానిని చేయుటకంటే, సంపూర్ణమైన దేవుని చిత్తమును తెలుసుకొని ఆలాగున జీవించుటకు ప్రయాసపడుదాం.

—D. యోనా, K.G.F. (కర్నాటక)

—— ——

(టైటిల్ 2వ పేజీ తరువాయి)

ఒరిస్సా, కర్నాటకలనుండి వచ్చిన సోదర సోదరీలతో బెయిలీ హాలు ఆనందోత్సాహములతో కళ కళ లాడింది. ఆరోజు 'యేసు క్రీస్తు దేవుని కుమారుడనుటకు గల ఆధారములేవి?' యను అంశమును సోదరులు కూలంకషముగా చర్చించిరి.

ఈ సదస్సులో సోదరులు R. Ch. సద్గుణరావ్ (శ్రీకాకుళం), K. కృపానందం (గొల్లపాలెం), చుక్కా అప్పారావ్ (రమణయ్యపేట), D. శ్రీరాములు (ములపరు), V. చిన్నయ్య (కడలి), P. ప్రకాశం (హైదరాబాద్), G. షడ్రక్ (పాలకొల్లు), పాల్ గూటం (గొల్లపల్లి), మరియు J. C. ఛోట్ గార్లు చర్చలో పాల్గొని గొప్ప ఆత్మీయ సందేశముల నిచ్చిరి.

యేసుక్రీస్తు పౌరాణిక వ్యక్తిగాక చరిత్రాత్మకవ్యక్తి. మానవ చరిత్ర అంతయు ఆయనను బట్టియే లెక్కింపబడుచున్నది. ఆయన ప్రవచనానుసారమైన వ్యక్తి. ఆయనను గూర్చి ఆయన రాకముందే కొన్నివందల ప్రవచనములు చెప్పబడినవి. అవన్నియును ఆయన రాకలో నెరవేరినవి. ఆయన చేసిన బోధలు, కార్యములు ఆయనే దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. మరియు ఆయనను గూర్చి తండ్రియైన దేవుడేగాక, ఆయన మిత్రులు, శత్రువులు, చివరకు దయ్యములు కూడ ఆయనే దేవుని కుమారుడని యిచ్చిన సాక్ష్యము లున్నవి. ఈలోకంలో ఉద్భవించిన మరియే మానవునికి యిట్టి సాక్ష్యములేదు. ఆయన దైవమానవుడు, మానవుల దేవుడు.

ఉదయకాల సమావేశములో స్త్రీలకు సోదరి బెట్టీ ఛోట్ గారు ప్రత్యేక తరగతిని నిర్వహించిరి, సాయంకాలం సదస్సు అనంతరం J. C. ఛోట్ దంపతులను సోదరులు పూలమాలలు వేసి, శాలువలు కప్పి ఘనంగా సత్కరించిరి. జాషువాగూటంగారు వందన సమర్పణ చేయగా, T. ప్రసాదరావ్ (మైలవరం) గారి ప్రార్థనతో సదస్సు అందరికీ ఆశీర్వాద కరంగా ముగిసెను. ★

## క్రైస్తవ కీర్తనలు

236 పాటలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక క్రొత్త పాటలు, సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న పాటలు చేర్చబడినవి. ఒక్కొక్క కాపీ వెల రూ॥ 12/– మాత్రమే. పోస్టేజీ ఇంకొక రెండు రూపాయలు. వలయువారు ఈ దిగువ చిరునామాకు రూ॥ 14/–లు M. O. చేసి పొందండి :

**SATYAVANI,**
Samba Murthy Street,
Kakinada - 533 004.

Regd. No. H/KD—45/KD H.O.
Date of Posting : 15th of Every month

*From*
SATYAWAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..................................................
..................................................
..................................................
..................................................